# లేట్ మాస్టర్

కె.వి.ఎస్.వర్మ


"ఎంతఘాటు ప్రేమయో ఇంత లేటు వయసులో " కొటేషన్‌రావు పాడుతున్నాడు.

" మహాకవి శ్రీశ్రీ ఏంటీ, ఇలాంటి పాట రాయడమేమిటీ అని అప్పట్లో రాజమండ్రి నుంచి వచ్చే పకపకలు, లేదా నవ్వులు పువ్వులు అనే మాసపత్రికలో విమర్శ వచ్చింది "

" సినిమా పాట రాయడానికి స్వేచ్ఛ వుండదుగా, నిర్మాత దర్శకులు ఎలాంటి పాట రాయమంటే అలాంటి పాట రాయాల్సిందేనట "

" ఆపాట మాటకేం కానీ, ఇప్పటి పాటలు వింటే అలాంటి పత్రికలవాళ్ళు గుండెలు బాదుకుందురేమో. నాకు బాగా గుర్తు, 'పకపకలు'లోనే అనుకుంటా, ప్రేమించి చూడు సినిమాలోని ఓపాటను బూతుపాటగా అభివర్ణిస్తూ విమర్శించారు "

అందులోని పాటలన్నీ హాయిగా వుంటాయే " అన్నాడు కథ్రలాజు ఆశ్చర్యంగా.




" అప్పట్లో కొందరికి కాదు. దాశరధి రాసింది అనుకుంటా, వెన్నెలరేయి ఎంతో చలీచలీ, వెచ్చనిదానా రావే నా చెలీ పాట గురించి విమర్శ వచ్చింది. వెచ్చనిదానా అనేమాట మరీ పచ్చిగా వుందని ధ్వజమెత్తారు " అన్నాడు కవికుమారుడు.

" అయ్యిందా. లేటు వయసు అంటే గుర్తొచ్చింది. సంవత్సరంన్నర కిందటిమాట, మా హెడ్డాఫీసు నుంచి ఫోనొచ్చింది, మర్నాడు పొద్దుట పదిగంటలకల్లా హైదరాబాద్ రావాలనీ, మా ఎం.డి. సేల్స్ ఆఫీసర్ల మీటింగ్ పెట్టాడనీ, గోదావరి, గౌతమిలకు ట్రై చేశాను. రిజర్వేషన్ దొరకలేదు. ఆర్టీసీబస్సు రాత్రి 8.15 కి వుందంటే టికెట్ రిజర్వ్ చేయించాను. మన సుబ్రహ్మణ్యాన్ని బస్సెక్కించమన్నాను. అలాగేనన్నాడు. [illegible]న్నరకే అతని స్కూటర్ మీద బయల్దేరాం. బస్‌స్టాండ్‌కి దగ్గర్లోనే వున్న బార్‌కెళ్ళాం. ఓ హాఫ్ బ్రాందీకి ఆర్డరిచ్చాను. గ్రీన్‌ఫీస్ ఫ్రై కూడా చెప్పాను.

నేను మొదటి పెగ్గు పూర్తి చేసి, సుబ్రహ్మణ్యం గ్లాసు వంక చూశాను. వాడి గ్లాసు సగం కూడా ఖాళీ కాలేదు. వాడి గురించి మీకూ తెలుసుకదా. మొదటి రెండు రౌండ్లలోనూ వాడు చాలా లేటు. మూడో పెగ్గునుంచి వీర విజృంభణే.

' మిత్రమా, రోజూలా కాదు. ఇవేళ త్వరగా లాగించు ' అన్నాను. నువ్వుకానీ, నిన్నందుకుంటాలే' అంటూ తన ఆఫీసు విజయాలగురించి చెప్పడం మొదలెట్టాడు. మూడో రౌండ్ కొచ్చేటప్పటికి నేను నా ఆఫీసు విజయాలు ఏకరవు పెట్టడం మొదలెట్టాను.

సుబ్రహ్మణ్యం ఎప్పుడు ఆర్డరిచ్చాడో తెలీదు మరో క్వార్టర్ తెచ్చాడు బేరర్ . వద్దన్నాను. వుండనీయ్ అని, బేరర్‌ని పొమ్మన్నాడు.

డోంట్ వర్రీ. నేను తాగుతానులే అంటూ ఖాళీ అయిన నా గ్లాసులో సగం పోసి, మిగతాది తన గ్లాసులోకి వంపుకున్నాడు.

టైమ్ చూశాను. ఎనిమిదయ్యింది.ఇంకా పావు గంట సమయముందనుకున్నాను. 8.10కి బిల్లు చెల్లించి బయల్దేరాం. 8.15 బస్సుఎలాగూ ఓ పావుగంట ఆలస్యంగా బయల్దేరుతుంది కదా అనుకున్నాను గతానుభవంతో.

తీరా వేం వెళ్లేసరికి బస్సప్పుడే వెళ్లి పోయిందన్నారు. 'ఇదేటీ, ఇంకా 8.15 కాకుండానే' అని మేం ఆశ్చర్యపోయాం. ఇవేళ త్వరగా బయల్దేరిందని అక్కడి వాళ్లు చెప్పారు. వెంటనే వెళ్తే కొవ్వూరులో ఆ బస్సును పట్టుకోవచ్చని ఒకాయన సలహా ఇచ్చాడు.

' పట్టుకోగలమా' అన్నాను సందేహిస్తూ.

" ప్రయత్నిద్దాం రా " అంటూ స్కూటర్ స్టార్ట్ చేశాడు. నేను సూటుకేసు పట్టుకుని వెనకాల కూర్చున్నాను. మనోడు స్పీడ్ పెంచాడు.

" కాస్త నెమ్మదిగా పోనీ " అన్నాను భయపడుతూ. తగ్గించాడు. కాస్త దూరం వెళ్లాక మళ్లీ స్పీడు పెంచాడు. రోడ్ కమ్ రైల్ బ్రిడ్జ్ ఎక్కాం. రోడ్డు బావోలేదేమో, ఓగతుకులో పడి వెనకాల చక్రం ఇంతెత్తు లేచింది. నా చేతిలోని సూటుకేసు జారిపోయింది. 'స్కూటరాపు' అని అరిచాను. ఆపేడు. వెనక్కి పరిగెత్తి సూటుకేసు తీసుకుని స్కూటరెక్కాను.

కొవ్వూరు బస్‌స్టాండ్ కెళ్లాం. హైదరాబాద్ బస్సు ఇప్పుడే వెళ్లి పోయిందని చెప్పారు. 'చూశావా, నెమ్మదిగా పొమ్మన్నావ్. బస్ మిస్సయిపోయింది' అన్నాడు సుబ్రహ్మణ్యం.

అతనితో వాదించి ప్రయోజనం లేదని రైల్వేస్టేషన్‌కి పదమన్నాను. సిమెంటు బెంచీ మీద కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ విశాఖ ఎక్స్‌ప్రెస్ కోసం ఎదురుచూశాం. అది కరెక్ట్ టైముకయితే ఉదయం ఎనిమిది, ఎనిమిదన్నరకు హైదరాబాద్ వెళ్తుంది. అయితే, సాధారణంగా కరెక్ట్ టైము కెళ్ళదు. అందుకే మొదట్లో దానికి ట్రై చెయ్యలేదు. ఓగంటకు రైలొచ్చింది. జనరల్ కంపార్ట్‌మెంటు ఎక్కాను. విజయవాడలో బెర్త్ దొరికింది. హైదరాబాద్‌లో దిగేటప్పటికి తొమ్మిదయ్యింది. గబగబా ఓ లాడ్జిలో దిగి తయారై నేను మా హెడ్డాఫీసు కెళ్లేటప్పటికి పావు తక్కువ పదకొండయ్యింది. అప్పటికే మీటింగు ప్రారంభమై ముప్పావు గంటయిందట.

" వై యు ఆర్ టూ లేట్ " అన్నాడు మా ఎం.డి.

నేను నీళ్లు నమిలాను. ఏదో ఓ ఆబద్ధం చెప్పాను.

ఆ తర్వాత ఎన్ని మీటింగులకు కరెక్ట్ టైముకి ముందే వెళ్ళినా, మా ఎం.డి. 'మన లేట్ మాస్టర్ ఈ సారి టైమ్‌కే వచ్చేశాడు' అనడం మొదలెట్టాడు నన్ను చూసి నవ్వుతూ.

అలా మా ఎం.డి. దృష్టిలో నేను లేట్ మాస్టర్ని అయిపోయాను " అని జగదీష్ నిట్టూర్చాడు.

అంతలో బ్రిడ్జి మీద ట్రెను వెళ్తున్న చప్పుడు వినిపించింది. టైమ్ చూస్తే తొమ్మిదిన్నర. గౌతమి ఇవేళ లేటు అనుకుంటూ అంతా లేచారు.

కొటేషన్‌రావు గోదావరి వంక చూస్తూ అన్నాడు -

**" మందులెన్ని రకములో మందు మహిమలూ అన్ని రకములు "**

(వచ్చేవారం: బాంబు భయం)



## పాఠక 'దరహాసం'

* వేదికపై రామాయణం నాటక ప్రదర్శన ముగింపుకు వచ్చింది. రావణాసురుడిని రాముడు ఆఖర్న సంహరించాడు. రావణ పాత్రధారి పాత్రపోషణకు ప్రేక్షకుల్లోంచి అభినందనల వెల్లువ వచ్చిపడింది.

'వెల్‌డన్!... వన్స్‌మోర్!!' అంటూ ప్రేక్షకులు కేరింతలు కొట్టారు. వెంటనే హఠాత్తుగా లేచి రాముడిచేత మళ్లీ యుద్ధానికి తలపడ్డాడు రావణ పాత్రధారి.

* "వారంలో ఆరురోజులపాటు ఏంచేస్తావ్?" అడిగాడు అప్పారావు సుబ్బారావుని.

"ఏమీ చేయను." చెప్పాడు సుబ్బారావు.

"పోనీ ఆదివారం...?"

"ఆరోజు సెలవుకదా!"

* రోడ్డుమీద పోతున్న రాజారావ్ ఓ బావిదగ్గర నిలబడి 'ఐదు ఐదు' అని అరుస్తున్న ఓ పిచ్చివాడ్ని చూసి వాడు పిచ్చివాడని తెలియక ఇలా అడిగాడు.

"ఐదు,ఐదు అంటున్నావ్? ఏమిటి!"

"ఇలారా...చెబుతా" అంటూ రాజారావ్ దగ్గరకు రాగానే పిచ్చివాడు అతణ్ణి టక్కున బావిలోకి తోసేసి,

"ఆరు ఆరు" అని అరవ సాగాడు.

* "హలో పోలీస్‌స్టేషనా! నా చిలుక పోయింది. అది చాలా తెలివైంది ఇన్‌స్పెక్టర్! మూడు భాషలూ మాట్లాడగలదు."

"అయితే ఫోన్‌దగ్గరే వుండండి. ఏ క్షణానైనా ఫోన్ రావచ్చు."

ఉచిత సలహా ఇచ్చిఫోన్ పెట్టాడు పోలీస్‌ఇన్‌స్పెక్టర్.

* "నేనీ మధ్య చాలా ప్రాంతాలు చూశాను. ఆఫ్రికా, మిడిల్ ఈస్ట్,స్విట్జర్లాండ్...ఎన్నో.."

"అయితే, మీకు జాగ్రఫీతో పరిచయముందన్న మాట."

"అబ్బే! లేదోయ్...ఆ ప్రాంతానికి మాత్రం వెళ్లడం కుదరలేదు."

-జి.వి.నాగేంద్రకుమార్, ఒంగోలు.

### గమనిక

పాఠకులు పాఠక'దరహాసం' కోసం పంపే జోకులు తమ సొంతమేనని తప్పనిసరిగా హామీ పత్రం జతచేయాలి.